
బాంబు, సేనాధిపతి

అంబర్టో ఇకో



అనగా అనగా

ఒక అణువు ఉండేది.



ఆ రోజుల్లో ఒక చెడ్డ సేనాధిపతి

ఉండేవాడు.

అతను బంగారు జరీతో అలంకరించిన

బట్టలు వేసుకునేవాడు.



ఈ ప్రపంచంలో ప్రతిదీ అణువులతోనే తయారవుతుంది.

అణువులు చాలా చిన్నవి, ఒక దానితో ఒకటి కలిసి మనకు తెలిసిన అన్ని వస్తువులు తయారవుతాయి.

అమ్మ అణువులతో తయారవుతుంది.
పాలు అణువులతో తయారవుతాయి.
ఆడవాళ్లు అణువులతో తయారవుతారు.
గాలి కూడా అణువులతో తయారవుతుంది,
నిప్పు అణువులతో తయారవుతుంది.
మనందరం అణువులతో తయారైన వాళ్లమే.



అణువులు సామరస్యతతో ఉంటే అంతా
బాగుంటుంది. ప్రపంచం ఈ సామరస్యత మీదే
ఆధారపడి ఉంది.

కాని అణువుని విచ్ఛిన్నం చేసినప్పుడు దానిలోని
అంశాలు ఇతర అణువులను తాకుతాయి, అవి
మరిన్ని అణువులను తాకుతాయి... అది అలా
కొనసాగుతూనే ఉంటుంది...

చివరకు ఒక భయానక విస్ఫోటనం
జరుగుతుంది!
ఆ అణువు చనిపోతుంది.



ఇతర అణువులతో పాటు
తనని అణు బాంబులో
పెట్టారని మన అణువు
బాధపడుతోంది.


ఆ బాంబుని వేసి,
అణువులను విచ్ఛిన్నం
చేస్తే, ఆ విస్ఫోటనానికి
మొత్తం నాశనం అవుతుంది.



బాంబులను పెంచుకుంటూ పోవటానికి తమ జీవితాలను వెచ్చించే సేనాధిపతులు ప్రపంచం అంతటా ఉన్నారన్నది ఒక వాస్తవం.

మన సేనాధిపతి కూడా అణుబాంబులతో తన దొడ్డి అంతా నింపేశాడు. “చాలా బాంబులు పోగు చేస్తాను," అతను అన్నాడు, “ఆ తరవాత ఒక అందమైన యుద్ధం మొదలుపెడతాను!" అంటూ నవ్వాడు.

ఎవరి దగ్గరైనా అన్ని బాంబులు ఉంటే వాళ్లు చెడ్డవాళ్లు కాకుండా ఎలా ఉంటారు?



అణు బాంబులో ఉన్న అణువులు
ఎంతో బాధపడుతున్నాయి.

వాటివల్ల ఎంతో నష్టం జరగబోతోంది.
ఎంతోమంది పిల్లలు చనిపోతారు,
అమ్మలు చనిపోతారు,
పిల్లులు చనిపోతాయి,
దూడలు చనిపోతాయి,
పక్షులు చనిపోతాయి -
అన్నీ చనిపోతాయి.

అందమైన ఇళ్లు, పచ్చని చెట్లు ఉండే
పట్టణాలకు పట్టణాలు మొత్తంగా
ధ్వంసమైపోతాయి.




... భయంకరమైన నల్లటి గొయ్యి తప్పించి
అక్కడ ఏమీ మిగలదు.



అందుకే, సేనాధిపతిపై తిరుగుబాటు
చెయ్యాలని అణువులు
నిర్ణయించుకున్నాయి.

ఒక రాత్రి,
అవి నిశ్శబ్దంగా బాంబుల నుంచి
బయటకు వచ్చి
నేలమాళిగలో దాక్కున్నాయి.



మరునాడు,
కొంతమంది పెద్ద మనుషులతో కలిసి
సేనాధిపతి తన పెరటిలోకి వెళ్లాడు.

“ఎంతో కష్టపడి ఈ బాంబులు చేశాం,
ఎంతో ఖర్చు కూడా చేశాం.
బూజు పట్టటానికి వాటిని ఇలాగే వదిలేస్తామా?
మీలాంటి సేనాధిపతులు ఉండి ఏమిటి లాభం?”
ఆ పెద్ద మనుషులు అన్నారు.

“నిజం చెప్పారు," సేనాధిపతి బదులు ఇచ్చాడు.
“వెంటనే ఒక యుద్ధం మొదలుపెట్టాలి,
లేకపోతే నా పేరు ప్రతిష్ఠలు ఏం కావాలి.”




ఆ వెంటనే సేనాధిపతి యుద్ధం ప్రకటించాడు.



అణు యుద్ధం జరగబోతోందని
తెలవటంతో ప్రజలు
భయపడిపోయారు:
“ఈ సేనాధిపతిని బాంబులు
తయారు చెయ్యనివ్వ కుండా
ఉండాల్సింది!“
అని అన్నారు.

కానీ, ఇప్పుడు చెయ్యగలిగింది ఏమీ
లేదు. అందరూ పట్టణాలు వదిలిపెట్టి
పారిపోయారు. కానీ ఎక్కడ
దాక్కుంటారు?




ఈలోగా సేనాధిపతి తన బాంబులను

విమానంలోకి ఎక్కించాడు.

అన్ని పట్టణాల మీద బాంబులు

వేసుకుంటూ వెళ్లాడు!



అయితే, బాంబులు పడినప్పుడు
(వాటిల్లో అణువులు లేనందు వల్ల)
ఎటువంటి విస్ఫోటనం జరగలేదు!
వెంట్రుకువాసిలో తప్పించుకున్నామని
(తమ అదృష్టాన్ని వాళ్లు నమ్మలేకపోయారు);
ప్రజలు సంతోషించారు. బాంబులను వాళ్లు
పూల కుండీలుగా చేసుకున్నారు.

బాంబులు లేని ప్రపంచం అందంగా ఉంటుందని
ప్రజలు తెలుసుకున్నారు...




అందుకే, ఇకపై యుద్ధాలు చెయ్యకూడదని
నిర్ణయించారు...
ఇప్పుడు అమ్మలు సంతోషంగా ఉన్నారు.
నాన్నలు సంతోషంగా ఉన్నారు.
అందరూ సంతోషంగా ఉన్నారు.



మరి సేనాధిపతి సంగతి ఏమిటి?
యుద్ధాలు లేకపోవటంతో అతడిని పనిలోంచి తీసేశారు.

బంగారు జరీతో చేసిన బట్టలను ఉపయోగించుకోటానికి అతడు ఒక హోటల్‌లో తలుపు దగ్గర స్వాగతం పలికే పనిలో చేరాడు. శాంతి నెలకొని ఉండటంతో ఎంతోమంది పర్యాటకులు హోటల్‌కి వచ్చేవాళ్లు. అందులో ఒకప్పటి శత్రువులు ఉండేవాళ్లు, సేనాధిపతి ఆజ్ఞలు జారీచేసిన సైనికులు ఉండేవాళ్లు.

వాళ్లు హోటలు లోపలికి, బయటికి వెళ్లేటప్పుడు సేనాధిపతి తలుపు తీసి, కొంచెం ఇబ్బందికరంగా వంగి, అభివాదం చేసేవాడు. వాళ్లు
(సేనాధిపతిని గుర్తుపట్టినవాళ్లు)
“ఈ హోటలులో పనివాళ్లు బాగాలేరు!” అనేవాళ్లు.





అప్పుడు,

సేనాధిపతి ముఖం ఎర్రబడేది,

కానీ అతడు మౌనంగా

ఉండిపోయేవాడు.

ఇప్పుడు అతనికి ఎటువంటి

ప్రాముఖ్యతా లేదు.



అయిపోయింది